క్లుప్తంగా

రేపటి నుంచి సైన్స్ ఎగ్జిబిషన్

తెనాలి అర్బన్: నేషనల్ సైన్స్ డే సందర్భంగా బుర్రిపాలెం రోడ్డులోని మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం స్కూలులో మాంటిస్సోరి గాట్ టాలెంట్ పేరిట సైన్స్ ఎగ్జిబిషన్‌ను శని, ఆదివారాలలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ జేమ్స్ మొరెలి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తయారు చేసిన పలు నమూనాలను ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. ప్రదర్శన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉంటుందన్నారు. ప్రదర్శనలో పాల్గొనే విద్యార్థులందరికీ వ్యాస రచన పోటీల్లో పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు. విజేతలకు నగదు ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని వివరించారు.

జూదరుల అరెస్టు

కొల్లిపర: మండలంలోని వల్లభాపురంలో గల అరటి తోటలో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని గురువారం అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.79 వేలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఆర్.రవీందర్‌రెడ్డి తెలిపారు. మండలంలో ఎవరైనా అక్రమంగా జూదం, కోడి పందేలు ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అమరుల త్యాగం చిరస్మరణీయం



సమావేశంలో మాట్లాడుతున్న పీటర్ థామస్

తెనాలి అర్బన్: స్వాతంత్ర్యోద్యమంలో అమరుల త్యాగం చిరస్మరణీయమని నవచైతన్య కళా మండలి సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ పీటర్ థామస్ పేర్కొన్నారు. యడ్ల లింగయ్య కాలనీలోని ఎయిడెడ్ పాఠశాలలో నవ చైతన్య కళా మండలి సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ఆజాద్‌కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో అమరులైన ప్రముఖుల జీవిత విశేషాల్ని, త్యాగాల్ని ఆయన వివరించారు. సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, సొసైటీ ప్రతినిధులు గొరికపూడి బాలరాజు, ప్రవీణ్ పాల్, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బుర్రకథ కళాకారుడు దాసురెడ్డికి సన్మానం



తెనాలి అర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో గురువారం భలే తమ్ముడు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. శుక్రవారం రామకృష్ణులు చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ బుర్రకథ కళాకారుడు అక్కల దాసురెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏనుగుల రంగారావు, కాకుమాను నరేంద్ర, కడియాల అనీల్, అక్కల కోటిరెడ్డి, వారే సాంబశివారెడ్డి, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, సోమవారపు సాంబశివరావు, ఈదర శ్రీనివాసరావు, దేవరపల్లి భవాని, ఎన్‌టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, గుమ్మడి ప్రసాద్, వెంకట్ పాల్గొన్నారు.

ఎన్‌సీఆర్ స్కూలులో విద్యార్థులకు వైద్య పరీక్షలు


విద్యార్థినికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పావని ప్రియాంక

తెనాలి అర్బన్: హ్యాపీ హాస్పిటల్, రెడ్ క్రాస్ సొసైటీ తెనాలి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం మారీసుపేటలోని ఎన్‌సీఆర్ఎన్ ఎంహెచ్ స్కూలులో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థులకు డాక్టర్ పావని ప్రియాంక, డాక్టర్ అరుణ్‌తేజ్ వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్య క్రమంలో స్కూలు ప్రధానోపాధ్యాయుడు బషీర్ అహ్మద్, రెడ్ క్రాస్ తెనాలి కార్యదర్శి ముమ్మనేని భానుమతి, హ్యాపీ హాస్పిటల్ ప్రతినిధులు ఉదయభాస్కర్, సురేంద్ర, సాంబయ్య, పూజ, వాణి, రెడ్ క్రాస్ తెనాలి కోశాధికారి నాళం శ్రీమన్నారాయణమూర్తి పాల్గొన్నారు.

రేపు భట్టిప్రోలు హైస్కూలు 79వ వార్షికోత్సవం

భట్టిప్రోలు: భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్ 79వ వార్షికోత్సవం, పాఠశాల సంస్థాపకుల సంస్మరణ దినోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, బాపట్ల విద్యా శాఖాధికారి పీవీజె రామారావు, డెప్యూటీ ఈఓ జి.వెంకటేశ్వర్లు హాజరు కానున్నట్లు తెలిపారు.

ఈనాడు దినపత్రిక ప్రతుల దహనం

అబద్ధ రాతలపై వైఎస్సార్ సీపీ నాయకుల ఆగ్రహం


ఈనాడు దినపత్రిక ప్రతులను దహనం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తెనాలి అర్బన్: ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై ఈనాడు దినపత్రిక అధినేత రామోజీరావు విషపు రాతలను నిరసిస్తూ వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ నేతలు గురువారం రాత్రి ముత్తింశెట్టిపాలెం వద్ద ప్రతుల్ని దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ఆది నుంచి ఈనాడు దినపత్రిక విషం చిమ్ముతూనే ఉందని ఆరోపించారు. ప్రభుత్వాన్ని గద్దె దించాలనే కుట్రను కూడా టీడీపీ నాయకులతో కలసి ఈనాడు యాజమాన్యం చేస్తోందని విమర్శించారు. ఈనాడు దినపత్రికను అందరూ బహిష్కరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పేరం సంజీవరెడ్డి, ఆవుల కోటయ్య, యాతాటి అనిల్, దుబాయ్‌బాబు, మొగల్ అహ్మద్, వైఎస్సార్ సీపీ నాయకులు అక్కిదాసు కిరణ్‌కుమార్, కఠారి హరీష్, కోలా వాసు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో 'ఈనాడు' ప్రతులు దహనం


ప్రతులు దహనం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

భట్టిప్రోలు: ఈనాడు దిన పత్రికలో తప్పుడు కథనాలకు నిరసనగా భట్టిప్రోలులో వైఎస్సార్ సీపీ నేతలు ఆందోళన నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఈనాడు దిన పత్రికలను దహనం చేసి, నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్య శాస్త్రి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ పడమట శ్రీనివాసరావు, పంచాయతీ వార్డు సభ్యులు పెరికల శ్యామ్, షేక్ అబ్దుల్లా కరీమ్, వైఎస్సార్ సీపీ నాయకులు వేల్పూరి బాలసుబ్రహ్మణ్యం, మోర్ల కోటీశ్వరరావు, తలకొల యలమంద, మేడూరి వీరయ్య, కె.ప్రసాద్, గోలి శ్రీనివాసరరావు, జవ్వాది కోటయ్య, ఎస్.జగన్‌మోహన్‌రావు, ఒగ్గి హనుమంతరరావు తదితరులు పాల్గొన్నారు.

వెల్లటూరు పీహెచ్‌సీలో రాష్ట్ర బృందం


గర్భిణులకు సూచనలిస్తున్న వైద్యులు

భట్టిప్రోలు: మండలంలోని వెల్లటూరు పీహెచ్‌సీని స్టేట్ కన్సల్టెంట్ టీమ్ గురువారం సందర్శించింది. స్టేట్ కన్సల్‌టెంట్ ఎస్.అరుణకుమారి, జిల్లా సమాచార అధికారి లక్ష్మణ్ బృందంలో ఉన్నారు. ఎనిమియ ముక్త్ భారత్‌లో భాగంగా గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పండంటి బిడ్డకు జన్మనిస్తారని సూచించారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది అందించే సలహాలను తప్పక పాటించాలని కోరారు. పీహెచ్‌సీ వైద్యురాలు చావలి రామలక్ష్మి ఆధ్వర్యంలో 26 మంది గర్భిణులకు హెచ్‌బీ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

దేశరక్షణే లక్ష్యంగా ఆర్మీ జవాను విధులు

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు


ఆర్మీ డే కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

నిజాంపట్నం: దేశ రక్షణే లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న ఆర్మీ జవానులను ప్రతి ఒక్కరూ అభినందించాల్సిందేనని ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు పేర్కొన్నారు. మండలంలోని బావాజీపాలెంలో ఆర్మీ డే సెలబ్రేషన్స్ వేడుకలను గురువారం నిర్వహించారు. సర్పంచ్ నజీర్ అహ్మద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మోపిదేవి వెంకటరమణారావు ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. జవానులు దేశం కోసం పోరాడుతున్న తీరును వాగా బోర్డర్‌లో తాను కొన్ని సందర్భాల్లో ప్రత్యక్షంగా చూసినట్లు చెప్పారు. తీరప్రాంతమైన బావాజీపాలెంలో ప్రతి కుటుంబం నుంచి ఒకరిద్దరు ఆర్మీలో ఉండటం మనకు ఎంతో గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా మాజీ సైనికులను, వారి కుటుంబాలను రాజ్యసభ సభ్యుడు మోపిదేవి అభినందించారు. కార్యక్రమంలోఎంపీపీ మోపిదేవి విజయనిర్మల హరనాథబాబు, స్థానిక సర్పంచ్ మహ్మద్ నజీర్ అహ్మద్, జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, మాజీ ఎంపీపీ ప్రసాదం వాసుదేవ, బావాజీపాలెం గ్రామ పెద్దలు, మాజీ సైనికులు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో హుండీ నగదు చోరీ


ఆలయంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్, సీఐ క్రైమ్ టీమ్

గొరిగపూడి(భట్టిప్రోలు): మండలంలోని గొరిగపూడి గ్రామ దేవత శ్రీ దేశమ్మతల్లి దేవాలయంలోని హుండీని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి నగదు అపహరించారు. గురువారం ఉదయం అర్చకుడు ఆలయం తలుపు తీయగా హుండీ పగలగొట్టి ఉండటాన్ని చూసి, దేవాలయ నిర్వాహకులకు, గ్రామ సర్పంచ్ గరిగపాటి మల్లికకు సమాచారం అందించారు. హుండీలో రూ.లక్ష వరకు నగదు ఉండొచ్చునని దేవాలయ నిర్వాహకులు తెలిపారు. సమాచారం మేరకు క్లూస్ టీమ్, సీఐ క్రైమ్ టీమ్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీమ్ ఎస్ఐ శ్రీనివాసరావు, ఏఎస్ఐ దానయ్య, భట్టిప్రోలు పోలీస్ సిబ్బంది వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే అధికారులపై చర్యలు

- ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్


కొత్తపేటలోని గిరిజన హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న వడిత్యా శంకర్ నాయక్

నెహ్రూనగర్: గిరిజన సంక్షేమ శాఖ పథకాల్ని క్షేత్ర స్థాయిలో సక్రమంగా అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై రాష్ట్ర ఎస్టీ కమిషన్ తీవ్రంగా పరిగణించి చర్యలు తీసుకుంటుందని సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ హెచ్చరించారు. ఆయన గురువారం గుంటూరులోని మహిళా ప్రాంగణంలో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ కళాశాల బాలికల వసతి గృహం, గిరిజన విద్యార్థుల గురుకుల పాఠశాల వసతి గృహం, కొత్తపేటలోని గిరిజన సంక్షేమ శాఖ కళాశాల విద్యార్థుల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గిరిజన కళాశాల బాలికల వసతి గృహంలో సరైన డ్రైనేజీ, బాత్ రూంలు లేకపోవడం చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా..లేదా? అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యల్ని వారు ఆయన దృష్టికి తెచ్చారు. మెనూ చార్ట్ ప్రకారం ఆహారం అందించడం లేదని వాపోయారు. వసతి గృహం అధికారిణి రమాదేవిని ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పకపోవడంతో శంకర్ నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యల్ని సాంఘిక సంక్షేమ శాఖ డెప్యూటీ డైరెక్టర్ దృష్టికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు.

సంత్ గాడ్గే బాబాకు ఘన నివాళి


సంత్ గాడ్గే బాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బహుజన నాయకులు

నెహ్రూనగర్: బహుజనులు సంత్ గాడ్గే బాబా అడుగుజాడల్లో నడవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జనసేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. రజక జన సేవా సంఘం ఆధ్వర్యంలో సంత్ గాడ్గే బాబా 147వ జయంతి సభను గురువారం కాకుమానువారితోటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జూపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ సంత్ గాడ్గే బాబా మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజల్ని చైతన్యవంతం చేశారన్నారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉండాలని, పిల్లల్ని చదివించుకోవాలని అప్పుడే జీవితంలో ఉన్నత స్థానానికి ఎదుగుతారని పాటలు ద్వారా చైతనవంతుల్ని చేశారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయన ఆశయాలను ప్రజల్లో తీసుకెళ్లేందుకు కృషి చేయాలని శ్రీనివాసరావు కోరారు. కార్యక్రమంలో బహుజన నాయకులు జీఆర్ భగత్‌సింగ్, ఉగ్గం సాంబశివరావు, నూతక్కి ఏడుకొండలు, గంటా ప్రభుదాస్, నాయకులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంతిమ సంస్కారం


అంత్యక్రియలు నిర్వహిస్తున్న సేవా సమితి బాధ్యులు

తెనాలి: అనాథ శవాలతో పాటు కరోనాతో మృతి చెందిన వారికి అంతిమ సంస్కారాల్ని నిర్వహిస్తున్న పట్టణానికి చెందిన శ్రీశివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి గురువారం 54 ఏళ్ల అనాథ మృతదేహానికి దహన సంస్కారాల్ని చేసింది. తమిళనాడుకు చెందిన సురేష్ ఎంతోకాలంగా తెనాలిలో జీవనం సాగిస్తున్నాడు. నందులపేటలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నడుస్తున్న పట్టణ పేదల నిరాశ్రయుల ఆశ్రమంలో ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో అనారోగ్యంతో మృతి చెందిన సురేష్ గురించి, ఆశ్రమం నిర్వాహకులు సేవా సమితిని అభ్యర్థించారు. దీంతో అధ్యక్షుడు కుర్రా శ్రీను, పిన్నెల రాఘవ, పోతురాజులు భౌతికకాయానికి గురువారం అంత్యక్రియలు నిర్వహించారు.

భట్టిప్రోలులో వాహనాల తనిఖీ

భట్టిప్రోలు: భట్టిప్రోలులో బాపట్ల మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్(ఆర్టీఓ) ప్రసన్న గురువారం తనిఖీలు నిర్వహించారు. పది వాహనాలను తనిఖీ చేసి, తగు ధృవీకరణ పత్రాలు లేనందున రూ.60 వేలు అపరాధ రుసుం విధించినట్లు ఆమె తెలిపారు. ట్యాక్సులు పెండింగ్ ఉన్న వాహనదారులు వెంటనే వాటిని చెల్లించాలని, లేకుంటే పెనాల్టీ పడుతుందని తెలిపారు.

స్కూలు బస్సు వితరణ

రేపల్లె రూరల్: యూఎస్ఏలో ఇండియన్స్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సేవలందిస్తున్న జొన్నగడ్డ సుధాకర్ తన తల్లి సత్యవతి జ్ఞాపకార్థం రూ.22లక్షలతో మండలంలోని వడ్డీవారిపాలెం గ్రామానికి చెందిన శ్రీమతి సావిత్రి గణేష్ జడ్పీ హైస్కూలుకు ఏర్పాటు చేసిన స్కూలు బస్సును ఈ నెల 24న శుక్రవారం 10 గంటలకు ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు ప్రారంభించనున్నారు. హెచ్‌ఎం మట్టా జ్యోత్స్న ఈ మేరకు గురువారం ఒక ప్రకటనలోతెలిపారు.

మృతదేహం అప్పగించాలని కోరుతూ బంధువుల ఆందోళన

గుంటూరు ఈస్ట్: మృతదేహాన్ని అప్పజెప్పాలని కోరుతూ బంధువులు జీజీహెచ్ అత్యవసర విభాగం వద్ద గురువారం ఆందోళన చేశారు. కేవీపీ కాలనీకి చెందిన నల్లబోతుల చెన్నమ్మ (50) అనారోగ్యానికి గురి కావడంతో బంధువులు ఆమెను జీజీహెచ్‌లోని అత్యవసర విభాగానికి గురువారం తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అయితే, చెన్నమ్మ అనారోగ్యానికి నాటు మందులు వాడినట్లుగా బంధువులు చెప్పడంతో అనుమానించిన వైద్యులు ఎమ్మెల్సీ (మెడికో లీగల్ కేసు)గా నమోదు చేశారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించబోగా మృతురాలి బంధువులు అడ్డుకున్నారు. సెక్యూరిటీ సిబ్బంది, అవుట్‌పోస్ట్ పోలీసులు అడ్డుకోవడంతో కొంతసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. చివరకు పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒకేచోట కాదు..విడివిడిగా ఉండాలి

ఐలవరం(భట్టిప్రోలు): అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నడపాలని మండల ప్రత్యేకాధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు ఆదేశించారు. గురువారం భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఒకే అద్దె భవనంలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహించడాన్ని గమనించారు. తాను మరోసారి పరిశీలనకు వచ్చే సరికి నిర్దేశించిన ప్రాంతాల్లో కేంద్రాలు ఉండాలని సూచించారు. అలాగే స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల హాజరు తగ్గిపోవడం పట్ల ఆరా తీశారు. మధ్యాహ్న భోజనం కూడా అంతగా బాగోలేదని... భోజనం బాగుండేలా విద్యార్థులకు వండి పెట్టాలని నిర్వాహకులకు ఆయన సూచించారు. అనంతరం సచివాలయాన్ని పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. సచివాలయం-2 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రూ.20 లక్షల నిధులతో పూర్తయిన సీసీ రోడ్లను పరిశీలించారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు మురుగుడు శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ప్రజల హృదయాల్లో సీఎం జగన్‌కు చిరస్థానం

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- 16వ వార్డులో ముగిసిన గడప గడపకు మన ప్రభుత్వం


మహిళ సమస్య తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి అర్బన్: గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాల్ని అందిస్తూ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 16వ వార్డు ముత్తింశెట్టిపాలెం నుంచి గురువారం సాయంత్రం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ 16వ వార్డు ఇన్‌చార్జిలు కాశిదాసు వెంకట సత్యం, కాశిదాసు విజయ, వార్డు నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేసి, వారి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ప్రజల మధ్య ఆర్థిక అసమానతల్ని తొలగించేందుకు సంక్షేమ ఫలాలు ఎంతో దోహదపడుతున్నాయని తెలిపారు. వీటి వల్ల పేద, మధ్య తరగతి ప్రజలు తమ జీవన ప్రమాణాన్ని పెంచుకుంటున్నారని చెప్పారు. తెనాలి నియోజకవర్గంలో 2.64 లక్షల మంది ఓటర్లు ఉన్నారని, వారిలో 86శాతం మందికి ప్రభుత్వం సంక్షేమ ఫలాల్ని అందించిందని పేర్కొన్నారు. పట్టణంలోని 40 వార్డులలో పేదలు ఉన్న ఒక్కొక్క వార్డులో ఇప్పటి వరకు రూ.20కోట్లు, మధ్య తరగతి ప్రజలు ఉన్న వార్డులో రూ.10కోట్ల సంక్షేమాన్ని అందించినట్లు వెల్లడించారు. 16వ వార్డులో ఇప్పటి వరకు రూ.21.54కోట్ల సంక్షేమాన్ని అందించినట్లు తెలిపారు. వైఎస్సార్ చేయూత 205, వైఎస్సార్ ఆసరా 570, వైఎస్సార్ సున్నా వడ్డీ 450, అమ్మ ఒడి 276, పింఛన్లు 403, ఇళ్ల పట్టాలు 536 మంది ఇచ్చినట్లు తెలిపారు. వార్డులో ఇప్పటి వరకు రూ.44లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రజల సమస్యల్ని గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా వచ్చే రూ.20లక్షలతో పరిష్కరించనున్నట్లు హామీ ఇచ్చారు. ఈ నెల 27న తెనాలి రానున్న సంక్షేమ ఆంధ్ర రథసారథి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి తెనాలి నియోజకవర్గ ప్రజలందరూ ఘనస్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. సంక్షేమ ఫలాల ద్వారా లబ్ధిపొందిన ప్రజలు 'మా నమ్మకం నువ్వే జగనన్న' అనే నినాదంతో స్వాగతం పలకనున్నట్లు చెప్పారు. మార్కెట్ యార్డులో జరిగే రైతు భరోసా కార్యక్రమంలో పెద్దసంఖ్యలో రైతులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సయ్యద్ ఖలేదా నసీమ్, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, రాష్ట్ర కృష్ణ బలిజ పూసల కార్పొరేషన్ డైరెక్టర్ కావేటి నిర్మల, మాజీ వైస్ చైర్మన్ గంటూరు కోటేశ్వరరావు, కౌన్సిలర్లు షేక్ దుబాయ్‌బాబు, యాతాటి అనిల్, షేక్ ఇస్మాయేల్, పేరం సంజీవరెడ్డి, మొగల్ అహ్మద్ బేగ్, కొమ్మరబత్తుని జయపాల్, దాసరి వసంతరావు, 16వ వార్డు నాయకులు మరియదాసు, రామలింగేశ్వరరావు, తురక శాంతి, దారా శ్రీధర్, వై.శ్యామ్, కన్నయ్య, శివమోహన్, నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, బట్టు శ్రీను, బట్టు శివ, బట్టు దుర్గారావు, కె.కృష్ణ, బి.నాగేశ్వరరావు, సుధాకర్, సుందరరావు, రాయపూడిబాబు, అంజి, బి.బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రైల్వే గేటు తెరిపించాలని రైతుల ఆందోళన


ఆందోళన చేస్తున్న రైతులు

తెనాలి: తెనాలి-రేపల్లె రైలు మార్గంలో చినరావూరు-జంపని కాపలాదారు లేని రైల్వే గేటు (ఎల్‌సీ నెం.257)ను తెరిపించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు-కౌలురైతు సంఘాల తెనాలి ప్రాంతీయ కమిటీల ఆధ్వర్యంలో గురువారం సంబంధిత రైల్వే గేటు ఎదుట రైతులు ఆందోళన చేశారు. తెనాలి రూరల్ మండల పరిధిలోని చినరావూరు, వేమూరు మండలంలోని జంపని మధ్య రైల్వేగేటును కాపలాదారు లేని కారణంగా రైల్వేశాఖ మూసివేసింది. దీనితో తెనాలి మండలంలోని జగ్గడిగుంటపాలెం, పెదరావూరు, బుర్రిపాలెం, కొల్లిపర మండంలోని చక్రాయపాలెం, వేమూరు మండలంలోని జంపని, అమృతలూరు మండల పరిధిలోని యడవూరు గ్రామాలకు చెందిన 400 ఎకరాల పంట భూములు రైల్వేగేటుకు అవతల ఉండిపోయాయి. ఆయా భూముల్లో రైతులు పండించిన వరి ధాన్యం, రబీలో సాగుచేసే మొక్కజొన్న, జొన్న పంటలను తరలించటం, ఎరువులు, విత్తనాలను చేలకు చేర్చుకునేందుకు 5–6 కిలోమీటర్లు చుట్టూ తిరిగి రావాల్సి వస్తోందని రైతులు తెలియజేశారు. ఫలితంగా రైతులు, కౌలు రైతులకు వ్యవసాయ ఖర్చులు పెరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఈ విషయాన్ని అధికారులు, డివిజనల్ రైల్వే మేనేజరు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ నివేదికను తెప్పించుకున్నారు. సంబంధిత డొంక రోడ్డును నాబార్డు నిధులతో తారు రోడ్డుగా ఇప్పటికే నిర్మించి ఉన్నందున, లెవెల్ క్రాసింగ్ గేటును తెరిపించాలని సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ రైల్వే అధికారులకు లిఖితపూర్వకంగా కోరారు. అయినా రైల్వేశాఖ పట్టించుకోవటం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి ఆధ్వర్యంలో రైతులు బొంతా ఆంజనేయులు, తాడిబోయిన వెంకటేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, కరేటి వెంకటరమణ, బొంతా కోటయ్య, తాడిబోయిన సత్యనారాయణ, నక్కా ప్రసాద్, బొంతా రమణయ్య, రావూరి వెంకటేశ్వర్లు, దొడ్డక సాంబయ్య పాల్గొన్నారు.

యూనివర్సిటీ అంబేడ్కర్ చైర్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కనపర్తి


రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డితో అబ్రహాం లింకన్

తెనాలి: పట్టణానికి చెందిన ఉన్నత విద్యావంతుడు డాక్టర్ కనపర్తి అబ్రహాం లింకన్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చైర్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. యూనివర్సిటీలో గురువారం ఉదయం బాధ్యతలు స్వీకరించిన అబ్రహాం లింకన్, అనంతరం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను వేర్వేరుగా కలసి కృతజ్ఞతలు తెలియజేశారు. వీరితో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కఠెవరపు దేవయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్యవేదిక వ్యవస్థాపకుడు అక్కిదాసు కిరణ్‌కుమార్ ఉన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్, దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ బట్టు నాగరాజును అబ్రహాం లింకన్ గౌరవపూర్వకంగా కలిశారు.

నేటి నుంచి ఫార్మసీ అంతర్ కళాశాలల క్రీడాపోటీలు


పోస్టర్లు విడుదల చేస్తున్న జూపూడి రంగరాజు, గోవిందరాజన్, నాగభూషణం, రవికుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు, కృష్ణా, ప్రకాశం, బాపట్ల జిల్లాల పరిధిలోని ఫార్మసీ కళాశాలల విద్యార్థులకు శుక్ర, శనివారాల్లో స్పర్థ పేరుతో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు తెలిపారు. అమరావతిరోడ్డులోని కళాశాలలో గురువారం క్రీడా పోటీల పోస్టర్లు విడుదల చేశారు. ఈసందర్భంగా జూపూడి రంగరాజు మాట్లాడుతూ నాలుగు జిల్లాల్లోని ఫార్మసీ కళాశాలల విద్యార్థులకు వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ, క్యారమ్స్, చెస్, షార్ట్‌పుట్ పోటీలను నిర్వహించి, విజేతలకు నగదు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేస్తామని తెలిపారు. ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జాన్సన్ ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడాపోటీలను ప్రారంభించనుండగా, శనివారం జరిగే ముగింపు కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతీ పవార్ బహుమతి ప్రదానం చేస్తారని తెలిపారు. కళాశాల పరిశోధన విభాగ డైరెక్టర్ ఆర్.గోవిందరాజన్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవికుమార్, ఫార్మా.డి డైరెక్టర్ పి.సీతారామయ్య, డాక్టర్ ఏ.సీతాదేవి, పీడీ సీహెచ్ అజిత్ బాబు పాల్గొన్నారు.